# డి. ఎ. కథ

సుబ్బారావు ఉద్యోగంలో చేరినాడు 'గువస్తా' అనీనూ, తర్వాతి కాలంలో "క్లార్కు" ఇటివలి కాలంలో "జూనియర్ అసిస్టెంటు" అనేపేర్లతో పిలువబడుతున్నాడు. తనని ఎలా పిలుస్తున్నారనే విషయంలో సుబ్బారావుకు ఏమంత పట్టింపులేదు. అసలు సుబ్బారావును సుబ్బారావుగా కాక 'సుబ్రావు' గానే ప్రపంచమంతా ధ్వనిస్తోంది. కాగా సుబ్రావ్‌కు ఉద్యోగంలో చేరిన మొదటి నెల జీతం అందుకొంటున్నప్పుడు చేతులు వణికెను. ఇంకా ఎన్ని పదుల సంవత్సరములలో ఈ జీతం నాలుగంకెలకు చేరును? అసలు చేరునా? అని తనలోతాను ప్రశ్నించుకొనెను. సెవన్టీస్‌లో ఓసారి తమస్కేళ్ళు సవరించబడేదాకా సుబ్రావ్ భాషలో గ్రాంధీకం ఉంది.

ఆ తర్వాతనుండి సుబ్రావ్ ఆలోచనా పరిధి విశాలమైంది. ఆఫీస్‌కు వెళ్ళకముందు వెళ్ళేక, వెళ్ళివచ్చేక కూడా ఆయన ఆలోచించే, చర్చించే, బాధ పడేలేక సంతోషోద్రేకపడే విషయాలు ఇరవయ్యో శతాబ్దం దాటేవరకూ ఎవర్‌గ్రీన్. అవిఏమనగా దినపత్రికలలో మామూలుల్లో ప్రచురించే వార్తలు అనగా ధరలసూచిక ఎన్నిపాయింట్లవద్దకు చేరిందో తెలుసుకోవటం, అప్పుడు మరొక్క డి. ఎ. బకాయిపడ్డారని నిర్ధారణ చేసుకోవటం. ఆ తర్వాత కేంద్రప్రభుత్వంవారు ఎప్పుడు చెల్లించగలరా అని అటు పత్రికలకి మొఖమూ, రేడియోకు చెవి పారెయ్యటమూ అతని కార్యక్రమం.

సుబ్రావ్ రాష్ట్రోద్యోగికాబట్టి, రాష్ట్రానికి బోలెడన్ని ఆర్థిక ఇబ్బందులుంటాయి కాబట్టి సెంటర్లో డి. ఎ. ప్రకటనవొచ్చినా, అదిరాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రివర్గసమావేశం జరిపి ప్రకటించి, జి.వో. జారీచేసేంత వరకూ నిత్యం శంకిస్తుండేవాడు.

సుబ్రావ్‌కు యూనియన్‌లో సభ్యత్వముంది. యూనియన్ అనగా డి.ఎ.లు పెంచుకోవటం, జీతాలు పెంపించుకోవటం మాత్రమేనని అతని గట్టి నమ్మకం.

అలాంటి సుబ్రావ్ ఎనిమిదవదశకంలో ఎగిరి గంతేసేడు. సెంట్రల్ వారు పే కమీషన్ రిపోర్టుల్ని ఆమోదించారని తెలిసింది.అంతలోనే దిగాలు పడ్డాడు. రాష్ట్రంవారు. డి.ఎ.ను మూలవేతనంతో కలపటంలో కొన్ని తేడాలు వచ్చాయి. అవెప్పుడు పరిష్కారం అవుతాయో తెలియటంలేదు. పెంచే జీతాలవల్ల రెండువందల కోట్లు అవుతుందంటున్నారు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. మరిలాంటి సందర్భంలో జీతాలు పెంచగలరా? పెంచినా సెంట్రల్ వారికి జనవరి నుండి ఇస్తుంటే తమకు జూలై నుండి ఇస్తామంటున్నారు. ఆ విధంగా ఎంత నష్టం వస్తుందో లెక్కలుకట్టి గుండెలు బాదుకున్నాడు సుబ్రావ్.

దేశంలో పత్రికలన్నీ జీతాలు ఎంతెంత పెరిగాయో సవివరంగా ప్రకటించేయి. మొత్తం ఎన్నివందలకోట్లు అవుతాయో తలుచుకొని సామాన్యుడి గుండె పగిలింది. అలాంటి సమయంలో మరోవారం రోజుల్లో రేగ్రూపింగ్ చేసిన వేతనాల్ని ప్రకటిస్తారనే వార్తవిని తన్మయత్వం చెందేడు సుబ్రావ్. ఆనెల అధికమయిన బడ్జెట్‌ను తక్షణమే ముందుంచింది శ్రీమతి.

పెరిగిన ధరలు

ఇంటి అద్దె : రూ. 75-00

బియ్యం : రూ. 40-00

| | | |
|---|---|---|
| నూనె : | రూ. | 40-00 |
| పాలు : | రూ. | 30-00 |
| రిక్షాలు, వగైరా : | రూ. | 30-00 |
| హొటల్ బిల్లులు : | రూ. | 50-00 |
| ఇతరములు : | రూ. | 150-00 |
| మొత్తం : | రూ. | 415-00 |

[కిలో ఒక్కింటికి 1 రూ॥ చొప్పున]

[కిలోకు రూ॥ 10 చొ॥న]

పెరిగే కొత్త జీతం 300 రూపాయలు కావచ్చు.

సుబ్రావ్‌కు కొంచెం బాధ అంతలోనే సంతోషం కలిగాయి. తనకు జీతం అందక ముందే 115 రూపాయల తేడా వచ్చింది. అంటే ధరల సూచిక కదిలింది. అంటే మరో వాయిదా కరువు భత్యం పడింది. ఈ కదలిక ఆగేదికాదు. ఇలా డి.ఎ.లు పెరిగి పెరిగి 1990 నాటికి మూడున్నర వేలవుతుంది. సుబ్రావ్‌కు మూడున్నర వేలు మరోసారి కళ్ళముందు కనపడగానే తన్మయత్వంతోనూ, ఆనందంతోనూ కొద్దిపాటి మూర్ఛవచ్చింది.

నీతి:- ధరలు తరగకుండా డి.ఎ.లు మాత్రమే పెంచుకుంటూపోయే ప్రభుత్వాలున్నంతకాలం ధరలసూచీ పెరుగుతుండటం, 'సుబ్రావ్'ల మూర్ఛలు సహజం.

డి.ఎ. అనగా డెడ్ ఎమౌంట్! ఈ నీతి 'సుబ్రావ్'లు గ్రహించి ప్రత్యామ్నాయం గురించి ఆలోచించనంత కాలం మూడు డి.ఎ.లు నాలుగు పేకమీషన్లువర్ధిల్లుతూనే ఉంటాయి.

—స్వాతి సపరివార పత్రిక